

డీఎస్సీ కోచింగ్‌కు 451 దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం నిరుద్యోగుల నుంచి 451 దరఖాస్తులు వచ్చినట్లు కర్నూలు డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. ఇందులో ఎస్‌జీటీ అభ్యర్థులు 326 మంది, స్కూల్ అసిస్టెంట్లు 125 మంది ఉన్నారని అన్నారు. 200 మందికి ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఇందులో ఎస్‌జీటీలకు ఎంత మంది, స్కూల్ అసిస్టెంట్లు సబ్జెక్టుల వారిగా ఎంత మందికి శిక్షణ ఇవ్వాలన్నది క్లారిటీ వచ్చిన తర్వాత శిక్షణా తరగతులను ప్రారంభిస్తామని చెప్పారు.

చాగలమర్రిలో వైరస్‌తో దెబ్బతిన్న చీనీ తోట





చీనీ పతనం



తెగుళ్ల దెబ్బతో చెట్ల కింద పడిన చీనీ కాయలు

చీనీ కాయల ధర రోజు రోజుకూ పడిపోతోంది. టన్ను రూ.10 వేల నుంచి రూ.82 వేలకు దిగజారిపోయింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో చీనీ కాయలు పక్వానికి వస్తాయి. కోత సమయంలో ధరలు తగ్గిపోయాయి. ప్రతి ఏటా ఇంతే. పంట దిగుబడి లేనప్పుడు ధర బాగా ఉంటుంది. కాయ చేతికి వచ్చాక ధర తగ్గిపోతుంది. మార్కెట్ మాయాజాలంలో రైతులు దగా పడుతున్నారు. వర్షాకాలం వ్యాపారులు కొనడానికి ముందుకు రావడం లేదు. దీంతో నష్టం తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- టన్ను రూ.50 వేల నుంచి రూ.10 వేలకు..
- పంట దిగుబడి సమయంలో తగ్గిన ధర
- ముందుకు రాని వ్యాపారులు
- తెగుళ్లతో దెబ్బతిన్న తోటలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

చాగలమర్రి, జూలై 26: నంద్యాల జిల్లాలో 1,389 ఎకరాల్లో చీనీ సాగు చేశారు. బనగానపల్లెలో 700 ఎకరాలు, నందికొట్కూరులో 92 ఎకరాలు, డోన్‌లో 104 ఎకరాలు, పాణ్యంలో 20, నంద్యాలలో 22, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో 84 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20, ఉయ్యాలవాడ 65, రుద్రవరం 63 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. శిరివెళ్ల, దొర్నిపాడు, శ్రీశైలం నియోజకవర్గంలో చీనీ సాగు చేయడం లేదు.

ధరల పతనం ఇలా..

జిల్లాలో చీనీ కాయల ధరలు ఉన్న ఫలంగా పడిపోయాయి. టన్ను రూ.10 వేల నుంచి రూ.8 వేలకు తగ్గిపోయింది. వ్యాపారులు పొలం వద్దకు వచ్చి ఇంత తక్కువ ధర చెప్పడంతో కాయలు అమ్మాలో లేదో తెలియక రైతులు మదనపడుతున్నారు.

నాడు రూ.50 వేల నుంచి రూ.10 వేలకు

రెండు నెలల క్రితం వరకు ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వచ్చాయి. టన్ను రూ.50 వేలు కూడా పలికాయి. ప్రస్తుతం ధర రూ.8 వేలకు పడిపోయింది. దీనికి కారణం ఇతర రాష్ట్రాల్లో వర్షాలు ఎక్కువగా కురవడమేనని వ్యాపారులు అంటున్నారు. ఢిల్లీ, ముంబై, కలకత్తా తదితర ప్రాంతాల్లో వ్యాపారం మందగించిందని, ఎగుమతులు లేకపోవడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

టన్ను రూ.25 వేలు ఉంటేనే..

చీనీ సాగు చేసినప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఫలసాయం ఉండదు. కంటికి రెప్పలా కాపాడుకుంటే ఆ తర్వాత దిగుబడి మొదలవుతుంది. ఈ సమయంలో మార్కెట్ ధరల హెచ్చు తగ్గులతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. చీనీ ధర కనీసం రూ.25 వేలకు పైగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం చీనీ చెట్లకు తెగుళ్ల బెడద అధికంగా ఉంది. తెగుళ్ల నివారణకు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వాడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. రసాయనిక ఎరువులు, సేంద్రియ ఎరువుల ధరలు బాగా పెరిగాయని, వీటన్నింటిని తట్టుకోవాలంటే చీనీ టన్ను కనీసం రూ.25 వేలు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.



దిగుబడి సమయంలో ధర లేదు

5 ఎకరాల్లో చీనీ పంట సాగు చేశా. దిగుబడి వచ్చే సమయంలో ధర లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. పెట్టుబడి కూడా రావడం లేదు. చీనీ కాయల వ్యాపారం సాగేలా ప్రభుత్వం చూడాలి.

హరిత, మహిళా రైతు, కొలుములపేట గ్రామం



రాయితీ కల్పించాలి

4 ఎకరాల్లో ఈనీ తోట సాగు చేశా. ఐదేళ్ల పాటు పంటను కాపాడుకుంటూ వచ్చా. దిగుబడి వచ్చే సమయానికి ధర లేదు. ధరలు తగ్గడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

-చిన్న సంజీవరెడ్డి, రైతు, కొలుములపేట



ఎండిన చీనీ చెట్టును చూపుతున్న రైతు



డ్రిప్ సౌకర్యం కల్పించాలి

చీనీ పంట సాగు వల్ల నష్టపోతున్నాం. రెండెకరాల్లో పంట సాగు చేశా. రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. పంట దిగుబడి వచ్చేసరికి ధరలు లేవు. వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముతున్నాం. డ్రిప్ సౌకర్యం కల్పిస్తే సాగులో ఇబ్బంది ఉండదు.

-రమణమ్మ, మహిళా రైతు, కొలుములపేట

ధరలు లేక చెట్లలోనే కాయలు

ధరలు లేకపోవడంతో రైతులు చీనీ కాయలు అమ్మేందుకు ఇష్టపడటం లేదు. జిల్లాలో చెప్పుకునే స్థాయిలో వర్షాలు కూడా కురవలేదు. ధర ఉంటే త్వరగా చీనీ కాయలు మార్కెట్‌కు తరలిస్తే మరో కాపుకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ధరలు లేకపోవడంతో కాయలు అమ్మేందుకు రైతులు సిద్ధపడటం లేదు. తోటల వద్దకు వచ్చే వ్యాపారులేమో మార్కెట్‌లో ఉన్న ధరకంటే తక్కువకు అడుగుతున్నారు. అమ్మకుండా ఉంటే చెట్లకే కాయలు మాగి రాలిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు చెట్లకున్న కాయలను గ్రేడింగ్ చేయించి తక్కువ ధరకే విక్రయించుకుంటున్నారు. అయితే ఈ ధరకు ఖర్చు కూడా చేతికి రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీలు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ధర లేక పొలాల్లోనే కుప్పగా పోసిన చీనీ కాయలు

పండ్ల తోటలపై అవగాహన కల్పించండి

కలెక్టర్ రాజకుమారి



బలపాలపల్లె గ్రామ పొలంలో మామిడి మొక్కలు నాటుతున్న కలెక్టర్ రాజకుమారి

బేతంచెర్ల, జూలై 26: జిల్లాలో ఉద్యాన పంటలు, బిందు తుంపర్ల సేద్యం వినియోగంపై రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బలపాలపల్లె, తవిసికొండ, బుగ్గానిపల్లె తండా, బిల్వసర్గం ప్రాంతాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ఐదు వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యాన్ని సాధించే క్రమంలో రైతులను ప్రోత్సహించాలని ఏపీఎంఐపీ పీడీని ఆదేశించారు. బలపాలపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన మామిడి ప్లాంటేషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. తవిసికొండ అటవీ ప్రాంతంలో ఉన్న ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం బిలసర్గంలోని పురాతన గుహలను సందర్శించారు. బిలసర్గం గుహలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బుగానిపల్లె తండాలో ఉన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, బేతంచెర్ల తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రవిప్రసాద్ తదితరులు ఉన్నారు

మల్లన్న సన్నిధిలో డోన్ ఎమ్మెల్యే

శ్రీశైలం, జూలై 26: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి అభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



ఆలయ ప్రాంగణంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

దేవుడి భూములను ఆక్రమించిన వైసీపీ నాయకులు

- మాధవాంజనేయ స్వామికి చెందిన 70 ఎకరాల్లో వ్యాపారం
- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, జూలై 26: వైసీపీ ప్రభుత్వ హయాంలో పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో కోట్ల విలువైన దేవుడి భూములు ఆక్రమణకు గురయ్యాయని ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ దృష్టికి ఆమె వైసీపీ నాయకుల భూ ఆక్రమణలను తీసికెళ్లారు. సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ మాధవ ఆంజనేయస్వామికి దాదాపు 188 ఎకరాలు భూమి ఉండగా రూ. కోట్లు విలువైన 70 ఎకరాలు వైసీపీ నాయకులు ఆక్రమించి వెంచర్‌లు ఏర్పాటు చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. అలాగే ఓర్వకల్లు మండలం శకునాల గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామికి చెందిన భూముల్లోని మట్టిని వైసీపీ నాయకులు అమ్ముకుని వ్యాపారం చేశారని తెలిపారు. దీని వల్ల ఆ భూములు ఎందుకూ పనికి రాకుండా పోయాయన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తు, జిల్లా పరిషత్‌ల నిధులను దోచుకున్నారని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని స్పీకర్ ద్వారా మంత్రికి విన్నవించారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గౌరుచరిత సభను కోరారు.

డోన్‌లో పర్యటించిన రైల్వే జీఎం



డోన్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అరుణ్ కుమార్ జైన్

డోన్(రూరల్), జూలై 26: డోన్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పరిశీలించారు. డోన్‌కు వచ్చిన ఆయనకు స్టేషన్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఘన స్వాగతం పలికారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ రైల్వే మేనేజర్ గదిలోని సిగ్నల్ వ్యవస్థను పరిశీలించి రైల్వే అధికారులకు పలు సూచనలు చేశారు.

నేడు పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్

జూపాడుబంగ్లా, జూలై 26: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి దిగువ ఉన్న ఎస్సార్‌ఎమ్సీ కాలువకు శనివారం నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ పార్థసారథి తెలిపారు. ఎగువ ప్రాంతాలైనా జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర నుంచి రెండు లక్షలకు పైగా శ్రీశైలం జలాశయంలోకి భారీగా వరద చేరుతోందని అన్నారు. శ్రీశైలం నీటి మట్టం శుక్రవారం 860 అడుగులకు దాటింది. కృష్ణానది యాజమాన్య బోర్డు నీటి విడుదలకు అనుమతి ఇచ్చిందని చెప్పారు. నీటి విడుదల అనంతరం ఎస్సార్‌ఎమ్సీ ద్వారా బానకచర్ల నీటి సముదాయం నుంచి తెలుగు గంగ, కేసీ ఎస్కేప్, ఎస్సార్బీసీ కాల్వల కింద ఉన్న జలాశయాలకు తాగునీటి అవసరాల కోసం మళ్లించనున్నట్లు ఆయన తెలిపారు. నీటి విడుదల కార్యక్రమానికి మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూఖ్ నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేలు గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి, గౌరు చరితారెడ్డి పాల్గొననున్నట్లు తెలిసింది.

కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు

ఎనిమిది నెలల తర్వాతే తిరిగి స్వామి వారి దర్శనం



పూర్తిగా జలాధివాసం అవుతున్న సంగమేశ్వరాలయం

కొత్తపల్లి, జూలై 26: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి శుక్రవారం భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. కొత్తపల్లి మండలంలోని శ్రీశైలం వెనుకతట్టు జలాల్లో నిక్షిప్తమైన సప్తనదుల సంగమేశ్వరుడు జలాధివాసమయ్యారు. మూడు అడుగుల మేర వరద వచ్చి చేరితో శుక్రవారం రాత్రిలోపు పూర్తిగా స్వామివారు జలాధివాసం కానున్నారు. నదిలో నీరు తగ్గితే మరో ఎనిమిది నెలల తర్వాతనే భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కలగనుంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 2,58,069 క్యూసెక్కుల వరద జలాలు శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరాయి. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగుల కాగా, 861 అడగులకు చేరుకుంది. అలాగే జలాశయం నీటి నిల్వ పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, 119.0060 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో రైతులు, నది పరివాహక ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ — అధికారుల్లో చలనం

- చెంచు కాలనీలో అత్యవసర సర్వే
- వివరణ ఇచ్చిన పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, మండల పరిషత్ అధికారులు
- ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

పాణ్యం, జూలై 26: పాణ్యంలోని ఇందిరానగర్ చెంచు కాలనీలో సమస్యలపై ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన ఎవరికీ పట్టని గిరిజనం కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం మండల రెవెన్యూ శాఖ అధికారులు జిల్లా పౌర సరఫరాల శాఖకు ఇచ్చిన విచారణ నివేదికలో మేకల రామక్క అనే బాలికకు జనన ధృవీకరణపత్రం లేకపోవడంతో ఆధార్ కార్డు, బియ్యం కార్డు లేదని తెలిపారు. అలాగే తోట రాజన్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్ జరగ కపోవడంతో బియ్యం కార్డు ఇవ్వలేదని తెలిపారు. త్వరలో బాలికకు ఆధార్ కార్డు నమోదు చేస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అట్లాగే తోట రాజన్న చెంచుకాలనీలో లేడని వివరణ ఇచ్చారు. దాసరి మల్లికార్జున గతంలో పింఛన్ తీసుకొనేవాడని, గత ఆరేళ్లుగా తీసుకోకపోవడంతో పింఛన్ నిలిపివేసినట్లు పాణ్యం 4 సచివాలయ సిబ్బంది ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి వివరణ ఇచ్చారు. మల్లికార్జున మళ్లీ దరఖాస్తు చేసుకోవడంతో మీ సేవా కేంద్రంలో డౌన్ లోడ్ కాలేదని వివరణ ఇచ్చారు. దాసరి నాగమణి బయోమెట్రిక్ అప్‌డేట్ కాకపోవడంతో సదరం క్యాంప్‌కు అప్లై చేయలేదని వివరణ ఇచ్చారు. అయితే ఎక్కువగా చెంచు మహిళలు ఇంటి వద్దే ప్రసవిస్తారు కాబట్టి జనన ధృవీకరణ పత్రాలకు అవకాశం లేదు. జనన ధృవీకరణ పత్రాలు లేని వారికి ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ఐటీడీఏ అధికారులు తీసుకోవాలి. అయితే ఈ మొత్తంలో ఐటీడీఏ అధికారులు స్పందించలేదు.



పింఛన్ అందని చెంచు వికలాంగులు

చెంచుల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం : చెంచు కాలనీలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వీఆర్వో శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే ఐదుగురిని గుర్తించామన్నారు. కాగా ఇప్పటికీ పింఛన్‌లు అందని వారు 30 మంది ఉన్నట్లు తెలిసిందన్నారు. వీరిలో ఆధార్ కార్డులు లేని వారికి అందేలా చర్యలు తీసుకుంటామని డీటీ రమాదేవి పేర్కొన్నారు.

ఉప్పొంగిన తుంగభద్ర

పొంగి పొర్లుతున్న ఆర్డీఎస్ ఆనకట్ట



అగసనూరు సమీపంలో ఆర్డీఎస్ ఆనకట్టపై పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర వరద

కోసిగి, జూలై 26: తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతి పెరగడంతో సుమారు లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్టపై వరద నీరు చేరింది. శుక్రవారం వరద నీటి ప్రవాహంతో తుంగభద్ర నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. పెద్ద ఎత్తున వరద నీరు పొంగి పొర్లుతుండటంతో నదీతీర ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోసిగి తహసీల్దార్ పి. మురళి హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం ఆర్డీఎస్ ఆనకట్టపై సుమారు 3 అడుగుల మేర వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కోసిగి మండల పరిధిలోని కడిదొడ్డి, కందుకూరు, సాతనూరు, అగసనూరు తుమ్మిగనూరు, లక్ష్మీనగర్ క్యాంప్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద నీరు గంట గంటకు పెరుగుతుండటంతో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో దండోరా వేసి హెచ్చరికలు జారీ చేశారు. వరద నీటితో గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పులి కనుమ రిజర్వాయర్, చెరువులకు నీటిని నింపాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మంత్రాలయం, జూలై 26: ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర పరవళ్లు శుక్రవారం మంత్రాలయాన్ని తాకాయి. వరద నీరు రావడంతో పుష్కరఘాట్ల వద్ద భక్తులు సందడి చేశారు. మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీలు మైకుల ద్వారా భక్తులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర, ఎస్ఐ గోపినాథ్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో నది తీరంలో బందోబస్తు నిర్వహిస్తూ ముందస్తు చర్యలుగా గజ ఈతగాళ్లను, అరిగెల్లను సిద్ధం చేశారు.



తుంగభద్ర ప్రవాహాన్ని తిలకిస్తున్న భక్తులు, గ్రామస్థులు, పర్యాటకులు

తుంగభద్రనదికి పోటెత్తిన వరద



నది ఒడ్డున ఉన్న వ్యవసాయపు మోటార్లను తొలగిస్తున్న రైతులు

కౌతాళం, జూలై 26: తుంగభద్ర నది నిండుకుండలా ప్రవహిస్తున్నది. నదీతీరంలో ఉన్న మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, మరళి, గుడికంబాలి, వల్లూరు గ్రామ రైతులు నది ఒడ్డున ఉంచిన వ్యవసాయపు విద్యుత్ మోటార్లను తొలగించారు. వాటిని ఒడ్డుకు చేర్చేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. నదిచాగి గ్రామ రైతులు విద్యుత్ పైపులు, మోటార్లను నది ఒడ్డు నుంచి బయటకు తీసేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడాల్సి వచ్చింది.

మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూలై 26: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై 40 గంటల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. 40 గంటల పాటు మధ్యవర్తిత్వంపై తమిళనాడుకు చెందిన ఇద్దరు రిసోర్స్‌పర్సన్స్ రత్నతార, శశిదేవి న్యాయవాదులకు వివరించారు. కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు న్యాయవాదులకు వీరు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమానికి కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన న్యాయవాదులు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకట శేషాద్రి కూడా పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపికకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 26: కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ శామ్యూల్ శుక్రవారం తెలిపారు. సీనియర్ మోస్ట్ స్కూల్ అసిస్టెంట్లు లేకుంటే సీనియర్ మోస్ట్ పీఈటీ ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ల నుంచి మూడు నెలల్లోపు పదోన్నతి వచ్చే అవ కాశం ఉన్న వారికి ఎంపికకు ప్రాధాన్యత లేదన్నారు. ఒకసారి స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేసిన వారు ఆరు సంవత్సరాలు పూర్తయ్యే వరకు అవకాశం ఉండదన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు పూర్తి సర్వీసు వివరాలతో సంబంధిత ధ్రువపత్రాలను 29వ తేదీలోపు డీఈఓ కార్యాలయానికి పంపాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోనెగండ్ల, జూలై 26: గోనెగండ్ల గ్రామ శివార్లలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గంజహళ్లి గ్రామానికి చెందిన మధుసూదన్(42) మృతి చెందాడు. మధుసూదన్ గంజహళ్లి నుంచి గురువారం సాయంత్రం ఎమ్మిగనూరుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున గోనెగండ్లలోని వీవర్స్ కాలనీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పత్తికొండ టౌన్, జూలై 26: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు క్షణికావేశంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం పత్తికొండ పట్టణంలో జరిగింది. పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయ సమీపంలో నరేష్ (35) తన భార్యా పిల్లలతో నివాసముంటున్నాడు. ఈయన పూలు, పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో భార్యా భర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో భార్య లలిత పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతునికి నలుగురు పిల్లలు ఉన్నారు. ఇంట్లో పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ విషయంపై సీఐ మురళీమోహన్‌ను వివరణ కోరగా.. ఆత్మహత్యకు సంబంధించిన ఫిర్యాదు రాలేదని తెలిపారు.

యజ్ఞంలా పించన్ల పంపిణీ చేయాలి

జిల్లా ప్రాజెక్టు అధికారి ఉమాదేవి



విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి

మద్దికెర, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పించన్ల పంపిణీని అధికారులు, సిబ్బంది ఒక యజ్ఞంలా నిర్వహించాలని జిల్లా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి, మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఇందులో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన పించన్ల పంపిణీ జరుగుతుందని, అధికారులందరూ సమర్థవంతంగా పని చేయాలన్నారు. సిబ్బంది కొరత ఏదైనా ఉంటే.. ఇతర శాఖల అధికారులను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి పించన్లు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని బైలు ప్రాంతంలో సాగు చేయడానికి ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలమ్మ, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, ఏపీవో నర్సిరెడ్డి, ఏవో ఉప్పర రవి, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, ఎంఈవో రంగస్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉయ్యాలవాడ, జూలై 26: మండలంలోని పెద్దయమ్మనూరు - సర్వాయిపల్లె గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మరి బ్రహ్మయ్య(70) అనే వృద్ధుడు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు. శుక్రవారం మృతుడు బ్రహ్మయ్య తన సొంత గ్రామం కాకరవాడ నుంచి నంద్యాల పట్టణానికి వెళ్తుండగా ఆళ్లగడ్డ వైపు నుంచి ప్రొద్దుటూరు పట్టణానికి వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బ్రహ్మయ్య మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బ్రహ్మయ్య తలకు బలమైన గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రఫీ తెలిపారు.

మేయర్‌పై కార్పొరేటర్ల ఫైర్

- రసాభాసగా వైసీపీ కార్పొరేటర్ల సమావేశం
- స్టాండింగ్ కమిటీలో అధి నాయకత్వం సూచించిన వారికే ఓటు

కర్నూలు(న్యూసిటీ), జూలై 26: నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వైసీపీలో చిచ్చురేపాయి. శుక్రవారం నగర శివారులోని ఓ హోటల్‌లో మూడు నియోజకవర్గాల కార్పొరేటర్లతో మేయర్ బీవై రామయ్య, జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి అంతర్గత సమావేశం నిర్వహించారు. వైసీపీ అధి నాయకత్వం సూచించిన ఐదుగురు కార్పొరేటర్లకు మాత్రమే ఓటు వేయాలని అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ సూచించారు. ఇందులో కర్నూలు నియోజకవర్గం నుంచి క్రాంతి కుమార్, యూనుస్, జుబైర్, పాణ్యం నుంచి మిద్దె చిట్టెమ్మ, కోడుమూరు నుంచి విక్రమసింహరెడ్డికి మాత్రమే ఓటు వేయాలని ఆదేశించారు. ఇంతలో టీడీపీ కండువాలు కప్పుకున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని కార్పొరేటర్లు మేయర్‌ను నిలదీశారు. 49వ వార్డు కార్పొరేటర్ మాట్లాడుతూ సీక్రెట్ పద్ధతిలో జరిగే ఎన్నికల్లో ఏ కార్పొరేటర్ ఎవరికి ఓటు వేసేదీ మీరెలా తెలుసుకుంటారని, వారి మీద ఎలా చర్య తీసుకుంటారని మేయర్‌ను ప్రశ్నించారు. ఖంగుతున్న మేయర్ వెంటనే మైక్‌ను కాటసానికి ఇచ్చేసారు.

● తాజాగా జరిగిన సర్వసభ్య సమావేశం చివరిలో ఇంకా తాను మాట్లాడుతుండగానే మేయర్ లేచి సభ ముగిసిందని చెప్పి వెళ్లిపోవడం ఏమిటని 4వ వార్డు కార్పొరేటర్ అర్షియా పర్వీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 7వ వార్డు కార్పొరేటర్ జుబేర్ మాట్లాడుతూ కమిషనర్ బదిలీ ఉందని తెలుసుకున్న కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆయనను మచ్చిక చేసుకుని రాత్రికి రాత్రి వారిని బదిలీ చేయడం ఏమిటని మేయర్‌ను ప్రశ్నించారు. కనీసం వాటికి సంబంధించిన ప్రొసీడింగ్స్ తమకు నగర పాలక కార్యాలయం నుంచి రాలేదని మేయర్‌కు చెప్పారు.



మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, కార్పొరేటర్లు

● కాటసాని మాట్లాడుతూ ప్రతి సర్వసభ్య సమావేశం జరిగే మూడు రోజులు ముందు ఎందుకు వైసీపీ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయడం లేదని మేయర్‌ను దండించారు. ఇకపై మనవాళ్లతో మూడు రోజులు ముందు సమావేశం ఏర్పాటు చేసి, వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని కాటసాని మేయర్‌ను ఆదేశించారు. మొన్న జరిగిన సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పదే పదే తనపైన విమర్శ చేసినప్పుడు, గత ప్రభుత్వ హయాంలో కబ్జాలు జరిగాయని మాట్లాడుతున్నప్పుడు ఎందుకు ఆమెను అడ్డుకోలేదని మేయర్‌ను ప్రశ్నించారు.

● కార్పొరేషన్‌లో ఏం జరుగుతోందో తెలిసినా మేయర్ తమకు ఎందుకు చెప్పడం లేదని కొందరు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం జరిగిన ప్రతిసారీ మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినా ఆయన తీరు మారకపోవడం విడ్డూరంగా ఉందని కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారు.

చిరస్మరణీయుడు బీవీ

నేడు మాజీ మంత్రి మోహన్‌రెడ్డి 12వ వర్ధంతి



ఎమ్మిగనూరు, జూలై 26: మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు ప్రజలకేగాక రాష్ట్ర ప్రజలకు చిరస్మరణీయుడు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ప్రియ శిష్యుడిగా పేరు పొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 1984లో ఎన్టీఆర్ సూచనలతో రాజకీయ అరంగ్రేటం చేసి ఎమ్మిగనూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి దాదాపు 30ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు మం త్రిగా పనిచేసి ఎమ్మిగనూరు నియోజకవర్గ రూపురేఖలను మార్చిన మహనీయుడిగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మిగనూరుకు ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత బీవీకే దక్కింది. ఉమ్మడి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలకు రహదారులు, ఎన్టీఆర్ గృహాలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో పాటు గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలను ఏడు ప్రాం తాల్లో ఏర్పాటు చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి రైతుల గుండెల్లో అపర భగీరథుడిగా నిలిచిపోయారు. ఎమ్మిగనూరు పురపాలక సంఘం రూపురేఖలు మార్చి రాష్ట్రంలోనే గ్రేడ్-1 మున్సిపాల్టీగా తీర్చిదిద్దిన ఘనత బీవీకే దక్కింది. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో శాంతిభద్రతలకు పెద్దపీట వేసి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించారు.

తండ్రి బాటలో తనయుడు

అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి తనయుడు జయనాగేశ్వరరెడ్డి తండ్రి బాటలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా నిలుస్తున్నారు. తండ్రి చూపిన బాటలో నడుస్తూ ఎమ్మిగనూరు ప్రజలతో మమేకమై ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ నియోజకవర్గానికి గుర్తింపు తీసుకువచ్చారు. ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచి చరిత్ర సృష్టించారు.

ఆటోను లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

శిరివెళ్ల, జూలై 26 : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన నాగేంద్ర(35) తన ఆటోలో వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్‌ను గ్రామాల్లోని దుకాణాలకు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా శిరివెళ్ల మండలం యర్రగుంట్లలో పని ముగించుకుని జాతీయ రహదారిపై నంద్యాల వైపు వెళ్తుండగా శిరివెళ్ల మెట్ట వద్ద ఆటోను లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అందులోని మరో వ్యక్తి రాముడు గాయాలపాలయ్యాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వెల్లడించారు.

విద్యుత్ బిల్లు చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించండి

కర్నూలు టౌన్ డివిజన్ అధికారులకు ఎస్ఈ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ ఉమాపతి

కల్లూరు, జూలై 26: విద్యుత్ బిల్లు చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఉమ్మడి కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. శుక్రవారం కర్నూలు టౌన్ డివిజన్ అధికారులతో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని, మెయింటెనెన్స్ బాగుండాలని అన్నారు. వినియోగదారులు ఇది వరకు ప్రైవేట్ యాప్‌లలో కరెంట్ బిల్లు చెల్లించే వారని, ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ యాప్‌లో నమోదై బిల్లు చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ వారిగా అధికారులు చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని అన్నారు.

కార్గిల్ అమరవీరుల

త్యాగాలను మరువలేం

కాగడాల ప్రదర్శనలో గౌరు



కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా చెన్నమ్మ సర్కిల్‌లో కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, జూలై 26: దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణలర్పించిన కార్గిల్ అమరవీరుల త్యాగాలను మరువలేమని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నమ్మ సర్కిల్‌లో టీడీపీ కూటమి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌లో భాగంగా అమరవీరులను స్మరించుకుంటూ చేపట్టిన కాగడాల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యంతో పోరాడి భారతదేశ ప్రజల ప్రాణాలను కాపాడిన సైనికులకు సెల్యూట్ చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎన్వీ రామకృష్ణ, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, పాణ్యం ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, రవిప్రకాష్‌రెడ్డి, పోలిరెడ్డి, బీజేపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, వీరప్ప పాల్గొన్నారు.

బైక్‌లో ఉంచిన

రూ.4 లక్షల నగదు అపహరణ

బేతంచెర్ల, జూలై 26: బైక్‌లో ఉంచిన రూ.4 లక్షల నగదును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బేతంచెర్ల పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన లారీ యజమాని నాగేష్ తన పొలాన్ని అమ్ముకోగా రూ.4 లక్షలు వచ్చాయి. ఆ మొత్తాన్ని బైకులో ఉంచుకుని బేతంచెర్ల పాత బస్టాండులో స్వీట్లు కొనుగోలు చేసేందుకు ఆగాడు. దుకాణంలో స్వీట్లు కొనుక్కొని వచ్చేలోగా బైకులో ఉంచిన రూ.4 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో నాగేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రేషన్ బియ్యం సీజ్

నంద్యాల క్రైం, జూలై 26: నంద్యాల జిల్లాలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టుబడినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం తెలిపారు. జిల్లాలోని బనగానపల్లె సర్కిల్ పరిధిలోని నందివర్గం సబ్ ఇన్‌స్పెక్టర్ పి.తిరుపాలుకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం బనగానపల్లె మండలం చెరువుపల్లె సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బొలెరో వాహనంలో 23 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. అయితే డ్రైవర్ మధు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. మరో ఘటనలో శిరివెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నండూరి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి స్థలంలో పీడీఎస్ రైస్ ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్సై సురేష్ తన సిబ్బందితో దాడులు చేశారు. అక్కడ 178 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, జూలై 26: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను వైభవంగా గా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు. అలాగే శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. షష్టి తిథిని పురస్కరించుకుని లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

మహానందిలో పల్లకీ ఉత్సవం

మహానంది జూలై 26: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్ శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కురగాయల దాత ప్రసాద్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి ఆషాఢం సారె

మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి ఆషాడం సారెను నందికొట్కూరుకు చెందిన దాతలు మాకం రమేష్, లక్ష్మి దంపతులు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా అషాఢం చీర, సారెతో వచ్చిన వీరికి ఆలయంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో శివుడికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కామేశ్వరీదేవి ఆలయంలో ఆర్చకులు మామిళ్ళపల్లి రాఘవశర్మకు ఆషాడం చీరె, సారెను అందజేశారు. కుంకుమార్చన పూజలను జరిపారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరీదేవి

మిడుతూరు, జూలై 26: మిడు తూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్ర వారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా కన్యకా పరమేశ్వరీదేవిని గ్రామస్థులు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలతో అలంకరించారు. అమ్మ వారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా మౌలాలిస్వామి జార్తులు

మహానంది, జూలై 26: మండలంలోని బుక్కాపురం గ్రామంలో మౌలాలిస్వామి జార్తులను ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి మౌలాలిస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామానికి చెందిన నల్లపాటి నరసింహులు అనే భక్తుడు తాను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్ డబ్బులతో స్వామికి పూలమాల అందచేస్తానని మెక్కుకున్నారు. దీనికోసం జార్తుల్లో భాగంగా మౌలాలీస్వామికి పెంచిన పింఛన్ రూ.6 వేల డబ్బులతో పాటు అదనంగా రూ.500 జమ చేసి పూలమాలను సమర్పించారు. కాగా శుక్రవారం తెల్లవారుజామున పీర్లను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో కార్మిక శాఖ మంత్రి



మంత్రి సురేష్‌కు స్వాగతం పలుకుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జూలై 26: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సురేష్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకముందు శ్రీశైల భ్రమరాంబ అతిథి వసతి గృహనికి చేరుకున్న మంత్రి వాసమ్‌సెట్టి సురేష్‌కు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మున్సిపల్ దుకాణాలకు వేలం పాట

నంద్యాల టౌన్, జూలై 26: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న పురపాలక శాఖ అధీనంలోని దుకాణాల అద్దె వేలం పాటలను నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ సహాయ కమీషనర్ డాక్టర్ అంకిరెడ్డి అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 30 దుకాణాలకు వేలం పాట జరిగింది. ఇందులో 9 దుకాణాలకు నెలకు ఒకొక్క దుకాణానికి రూ.9 వేలు చొప్పున పాటాదారులు అద్దె చెల్లించేందుకు వేలం దక్కించుకున్నారు. మరో దుకాణానికి నెలకు రూ.18 వేలు, ఇంకో దుకాణానికి రూ.15 వేలు నెలకు చెల్లించేందుకు పాటాదారులు వేలంలో దక్కించుకున్నారు. మిగతా 19 దుకాణాలను అద్దెకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాని కారణంగా వాటి వేలంను వాయిదా వేసినట్లు సహాయ కమిషనర్ తెలిపారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



తలత్ పర్వీన్

నందికొట్కూరు, జూలై 26: నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్న తలత్ పర్వీన్ డాక్టరేట్ పొందారు. భౌతికశాస్త్రంలో 'అబ్జర్వేషన్ అండ్ కంపారిజన్స్ ఆఫ్ వేరియేషన్ ఇన్ ఇన్‌స్టాబిలిటీ ఇన్డిసిస్ ఇన్ డిఫరెంట్ రీజన్స్ ఆఫ్ ఇండియా త్రు రేడియో సౌన్ డే డేటా' అనే అంశంపై చేసిన పరిశోధనకు హైదరాబాదులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

'విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి'

నంద్యాల క్రైం, జూలై 26: విద్యార్థులు చిన్న తనం నుంచే సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు సూచించారురు. ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న పిల్లలు, మహిళలపై జరిగే నేరాలు, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, హెల్మెట్ ప్రాముఖ్యత, బాల్యవివాహాలు, సైబర్ క్రైం, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ర్యాగింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే 100, 112నెంబర్లకు తెలియజేయాలని విద్యార్థులకు పోలీస్ అధికారులు సూచించారు.

'ఖాళీ స్థలాల్లో నీటి నిల్వను తొలగించాలి'



27వ వార్డులో పర్యటిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), జూలై 26: వార్డులోని ఖాళీ స్థలాలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచించారు. మన ఊరు, మన నంద్యాల మన బాధ్యత నినాదంతో శుక్రవారం 27వ వార్డులో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి యజమానులకు నోటీసులు పంపించి చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని కోరారు. వార్డులో ఉన్న సమస్యలను వార్డు ప్రజలు ఫిరోజ్ దృష్టికి తీసుకు వచ్చారు. మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్ళి సమస్యల పరిష్కారారినిక కృషి చేస్తామని హామి ఇచ్చారు. టీడీపీ కౌన్సిలర్ జైనాబీ, మాజీ కౌన్సిలర్లు దూదేకుల దస్తగిరి, చిన్న హుసేని, పల్లె చిన్న వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు సురేష్ కుమార్, మదార్ మౌళాలి, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్ తదిరులుపాల్గొన్నారు.

మెలకువలతో మేలైన దిగుబడులు: జేసీ

నంద్యాల రూరల్, జూలై 26: రైతులు పంటల సాగులో సాంకేతిక పరమైన మెలకువలు తెలుసుకుని తద్వారా మేలైన దిగుబడులు సాధించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంతో పాటు వరి పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో చర్చించారు. జేసీ మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తే మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. అంతకుముందు సేవా కేంద్రంలోని డి.క్రిష్ ద్వారా విత్తనాలు, కియోష్క్ ద్వారా ఎరువులు అందించే ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. అలాగే మట్టి నమూనా సేకరణ గురించి వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లలాపురం గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నట్లు, వరి సాగు రైతులకు 50 శాతం సబ్సిడీతో 25 క్వింటాల జీలుగ విత్తనాలు అందించినట్లు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ జేసీకి వివరించారు. గ్రామ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా రెండు యూనిట్ల (60 బస్తాలు) కర్నూలు సోనా బీపీటీ 5204 రకం ఫౌండేషన్ వరి విత్తనాలను అందించినట్లు తెలిపారు. ఫౌండేషన్ విత్తనాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలను వారే సమకూర్చుకుంటారని తెలియజేశారు. వరి నాటు వేసే సమయంలో, దుబ్బు వేసేటపుడు, వెన్నుదశలో, ఉపయోగించాల్సిన ఎరువుల గురించి వివరించారు. కార్యక్రమంలో నంద్యాల ఏడీఏ రాజశేఖర్, ఏవో ప్రసాదరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అధికారులలో చర్చిస్తున్న జేసీ విష్ణుచరణ్

కుష్ఠు సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కాంతారావు



గువ్వలకుంట్ల అంగన్‌వాడీ సెంటరులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కాంతారావు

కొత్తపల్లి, జూలై 26: గిరిజన గూడేలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు వ్యాధి గ్రస్థుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని నంద్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.కాంతారావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గువ్వలకుంట్ల, పెద్దగుమ్మడాపురం, శివపురంగూడెం, కొత్తపల్లి గ్రామాల్లో కుష్ఠువ్యాధిపై నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం కొత్తపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి డా.మహ్మద్ బేగ్‌ను రోజువారి ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లి హైస్కూల్‌లో డయేరియా, డెంగీ నివారణపైప విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గువ్వలకుంట్ల అంగన్‌వాడీ సెంటరులో విద్యార్థులకు పుట్టుకతో వినికిడి లోపాలు, వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలు, చిన్నారులు, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచివడబోసిన నీరును తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బాలకృష్ణయ్య, పీహెచ్ఎన్ ఆయేషాబేగం, ఎంపీహెచ్ఎస్ శృతి, జ్యోతి, వైద్యసిబ్బందిత పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు

శాంతిరాంలో అరుదైన శస్త్రచికిత్స

పాణ్యం, జూలై 26: శాంతిరాం ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ ఈనెల 19 తేదీన నంద్యాలకు చెందిన శ్రావణి, హుశేన్ ధంపతులకు చెందిన 16 నెలల కుమారుడు లలిత్ కుమార్‌ను ఊపిరితిత్తుల వ్యాధితో ఆసుపత్రిలో చేర్పించారని చెప్పారు. ఎక్స్‌రే, సీటీ స్కానింగ్ చేసి ఊపిరితిత్తులలో గడ్డ (బ్రోంకోజెనెసిస్) ఉన్నట్లు గుర్తించామన్నారు. అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స కావడంతో వైద్యబృందంతో టీం ఏర్పాటు చేసి మూడు గంటలపాటు శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. శుక్రవారం బాలున్ని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో కార్డియోథొరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ మురళీహరీష్, అనస్థీషియాసిస్ట్ డాక్టర్ చెన్నకేశవ, వైద్య సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

పాములపాడు, జూలై 26: మండలంలోని మద్దూరు గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ జిల్లా మానిటరింగ్ కమిటీ అధికారులు డాక్టర్స్ సునీత, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నజనీన్, జిల్లా డేటా మేనేజర్ శివ తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, శిశువులకు అందించే సేవలు ఆన్‌లైన్‌లో యమోదు చేసిన వివరాలను పరిశీలించారు. సీహెచ్‌వో అన్నమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, సూపర్‌వైజర్ మద్దయ్య రవికుమార్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నందికొట్కూరు, జూలై 26: వైసీపీకి చెందిన మిడ్తూరు మండలం వీపనగండ్ల గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వీపనగండ్ల గ్రామానికి చెందిన సర్పంచ్ తిమ్మారెడ్డి, ఉప సర్పంచ్ రమణారెడ్డి, రాఘుస్వామి రెడ్డితో పాటు మరికొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

'సమస్యలు పరిష్కరించాలి'

గడివేముల, జూలై 26: మండలంలోని బిలకలగూడురు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకుడు, బిలకలగూడురు మాజీ సర్పంచ్ ఎస్‌ఏ రఫిక్ కోరారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ మల్లెపోగు పెద్దనారాయణ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు విలువ లేకుండా చేశారన్నారు. గ్రామ సచివాలయ శిలాఫలకంపై ప్రస్తుత సర్పంచ్ మల్లెపోగు పెద్దనారాయణను మాజీ సర్పంచ్‌గా ముద్రించారని అన్నారు. దీంతో ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొందని అన్నారు. టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో శిలాఫలకంపై తప్పులను సరిదిద్దారని అన్నారు. గ్రామసభలో మిరిట్ బుక్‌లో సమస్యలను నమోదు చేయకుండా ప్రజల సంతకం తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి షబాన, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

నంద్యాల (నూనెపల్లె), జూలై 26: రామకృష్ణ డిగ్రీ ఆటానమస్ కళాశాల ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శుక్రవారం తెలిపారు. బహుళ జాతీయ కంపెనీ ఆల్‌సెక్ టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాలకై జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీల ఉత్తీర్ణత కలిగిన విద్యార్థులు ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడి టోరియంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని, జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలతో పాటు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య , డైరెక్టర్ హేమంత్ రెడ్డి, మేనేజర్ ప్రగతి రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కుమార్, కేఎస్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషన్ సభ్యుడు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

నంద్యాల (నూనెపల్లె), జూలై 26: కలెక్టర్ రాజకుమారిని ఏపీ బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు.

స్వచ్ఛతతో ఆరోగ్య రక్షణ: డీఎల్‌పీవో



కొత్రపొలూరులో షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

నంద్యాల రూరల్, జూలై 26: స్వచ్చతతో ఆరోగ్య రక్షణ సాధ్యమని డీఎల్‌పీవో రాంబాబు అన్నారు. నంద్యాల మండలంలోని పెద్దకొట్టాల, పులిమద్ది గ్రామాలలో శుక్రవారం స్వచ్ఛతా పరిశీలన కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రం ఎంపిక చేసిన గ్రామాలలో 15 రకాల సమస్యలపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలోని అన్ని రకాల పాఠశాలలతో పాటు డ్రైనేజీ, మరుగుదొడ్లు, తదితర వాటిపై పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎంపీడీవో సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

గడివేముల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో రాంబాబు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వోడీఎఫ్ సర్వేలో భాగంగా మండలంలోని కొత్రపొలూరు గ్రామంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం గణద్రవ్య వ్యర్థపదార్థాలను నిర్వహించే షెడ్లను పరిశీలించారు. నంద్యాల ఎంపీడీవో సౌభాగ్యమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'నీటిని విడుదల చేయాలి'

నంద్యాల టౌన్, జూలై 26: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా, సుంకేసుల ద్వారా నీళ్లు వదలాలని కోరుతూ జలవనరుల శాఖ అధికారులను ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కోరారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, జిల్లా నాయకులు సురేష్ తెలుగుగంగ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందించారు. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణ, తుంగభద్ర నదులకు వస్తున్న వరద జలాల వల్ల శ్రీశైలం డ్యాం నీటి మట్టం 864 అడుగులకు పైగా చేరినందు వల్ల రాష్ట్ర ప్రభుత్వం, జలవనరుల శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని అన్నారు. సుంకేసుల ద్వారా కేసీ కెనాల్‌కు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, హంద్రీ-నీవా కాల్వలకు వెంటనే నీళ్ల వదిలి తద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు నింపాలని కోరారు.

నేటి నుంచి వైద్య వైజ్ఞానిక సదస్సు



రాష్ట్ర సదస్సు బ్రోచర్లను విడుదల చేస్తున్న వైద్యులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 26: నంద్యాలలో మధుమణి నర్సింగ్ హోంలో డాక్టర్ మధు సూధన్‌రావు డాక్టర్ నాగమణి, డాక్టర్ మణిదీప్‌ల ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు 15వ రాష్ట్ర స్థాయి చెవి, ముక్కు, గొంతు, వైద్య వైజ్ఞానిక సదస్సు జరుగుతుందని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. శుక్రవారం సమావేశ భవనంలో రాష్ట్ర స్థాయి సదస్సు బ్రోచర్లను వైద్య బృందం విడుదల చేశారు. ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది యువ ఈఎన్టీ వైద్యులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, అప్పారావు విద్యాసాగర్ శ్రీపతి తదిరతులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి మాతృభూమికి కళార్చన

నంద్యాల (నూనెపల్లె), జూలై 26: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఐఎంఏ ,లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి పాఠశాల విద్యార్థులకు మాతృభూమికి కళార్చన, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర మధుసూధనరావు, డాక్టర్ రవికృష్ణ శుక్రవారం తెలిపారు. గత 23 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 75 అంశాలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, కేటగిరిలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 సాయంత్రం జరిగే ఉత్సవంలో పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీల వివరాల పుస్తకాన్ని బాలాజి కాంప్లెక్స్‌లోని కళారాధన కార్యాలయంలో అందజేయస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు తమ పేర్లను అక్కడే నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959307424,6300715927 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళి

నంద్యాల (నూనెపల్లె), జూలై 26: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాన్ని నిర్వహించారు. కార్గిల్ యుద్ధ సమయంలో సైనికులుగా ఉండి పోరాడిన మాజీ సైనికులు నియాజి, లక్ష్మయ్యను లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు నిజాముద్దీన్, కార్యదర్శి రమేష్, నాగరాజు, రవిప్రకాష్, సుధాకరరెడ్డి, డాక్టర్ సహదేవుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కార్గిల్ దివస్ సందర్భంగా శుక్రవారం ఆత్మకూరులోని గౌడ్‌సెంటర్‌లో మాజీ సైనికులు కార్గిల్ యుద్ధ వీరులకు ఘనంగా నివాళి అర్పించారు. ఆత్మకూరు మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ప్రభాకరశెట్టి, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య, మాజీ సైనికులు మల్లికార్జున సింగ్, రఫీక్, సలీం బాషా, షర్ఫుద్దీన్, సత్యనారాయణ, శంకరయ్య, బ్రహ్మసింగ్ ఉన్నారు.



ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

నందికొట్కూరు: కార్గిల్ విజయ సంకల్పయాత్రను బీజేపీ ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి దేవాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు శుక్రవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నందికొట్కూరు బీజేపీ కోఆర్డినేటర్ చల్లా దామోదర్ రెడ్డి, నాయకులు రవికుమార్‌రెడ్డి, రామచంద్రుడు, అశ్విని కుమార్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగలకు రెండేళ్ల జైలు శిక్ష

నంద్యాల క్రైం/పాణ్యం, జూలై 26: పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్‌కు వెళ్లేదారిలో దారిదోపిడీ దొంగలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం వారికి జైలు శిక్ష విధించినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. తమ్మరాజుపల్లె నుంచి సిమెంట్‌నగర్‌కు వెళ్లేదారిలో నిర్మానుష్య ప్రదేశమైన గొటికమాను బీడులో కొందరు వ్యక్తులు గుంపులుగా దారిదోపిడీకి ప్రయత్నిస్తున్నారనే సమాచారం మేరకు అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవన్ గంగనాథ్‌బాబు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లగా వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకొని తనిఖీ చేసి వారి వద్ద నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన చెంచు దాసరి వీరయ్య, చిగుర్ల మంథనాలు అలియాస్ మంతిగాడు, చిగుర్ల గొలుసన్న అలియాస్ గొలుసుగాడు, గోరుకల్లు గ్రామానికి చెందిన తోటనాగన్న అలియాస్ చిన్న, తోట చిన్న ఈరన్న అలియాస్ చిన్న ఈరిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా సీనియర్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ కోర్టులో సరైన సాక్ష్యాధారాలు సమర్పించినందున నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి విచారణ జరిపి నేరం రుజువైనందున సదరు ముద్దాయిలకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.7వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

వెలుగోడు, జూలై 26: మండలంలోని రేగడగూడూరు గ్రామానికి చెందిన జశ్వంత్ (19) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు వీఆర్వో వేణు తెలిపారు. జశ్వంత్ కూలీ పని కోసం వెళ్లగా అక్కడ పని వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మహానంది, జూలై 26: మహానందికి చెందిన బాలరాజు (58) నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల 24 వతేదిన మృతుడు బాలరాజు జీవితంపై విరక్తి చెంది విషద్రావణాన్ని తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. బాలరాజు కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలి'

పగిడ్యాల, జూలై 26: వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈవోఆర్డీ నాగేంద్రమయ్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పగిడ్యాల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఓడీఎస్ ప్లస్, జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాలకు సంబంధించి శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అన్ని రంగాల్లో డ్రోన్ వ్యవస్థ కీలకం'

పాణ్యం, జూలై 26: నేటి అన్ని రంగాల్లో డ్రోన్ వ్యవస్థ కీలకమైందని ఇండియా డ్రోన్ అకాడమీ డైరెక్టర్ కూరాకుల వంశీకృష్ణ అన్నారు. మండలం లోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డ్రోన్ సాంకేతికతపై ఏడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో డ్రోన్ ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ఈ సాంకేతికతను వైద్య, మిలిటరీ, వ్యవసాయ రంగాలలో విరివిగా ఉపయోగిస్తున్నారన్నారు. విద్యార్థులు డ్రోన్ సాంకేతికతలో నైపుణ్యం సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అకాడమీ బోధనోపాధ్యాయులు సుమిత్ కృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వినోద్‌కుమార్, అధ్యాపకలు పాల్గొన్నారు.

'హెల్మెట్ ధరించడం శ్రేయస్కరం'

ఆత్మకూరు, జూలై 26: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమని న్యాయవాది మాణిక్యాల రావు అన్నారు. ఆత్మకూరులోని ఎస్ఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా తమ ప్రయాణంలో హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. తద్వారా ఏదైనా రోడ్డు ప్రమాదాలు సంభవించినట్లయితే ప్రాణాపాయం బయటపడే అవకాశం ఉంటుందన్నారు. తల్లితండ్రులు మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వొద్దని సూచించారు.

'విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి'

ఆత్మకూరు, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు ఆర్.నాయక్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం 3శాతం మాత్రమే నిధులు కేటాయించడం బాధాకరమని అన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించకుండా విద్యారంగానికి 30శాతం నిధులు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను ఇవ్వాలని, పెండింగ్‌లో వున్న విద్య, వసతి దీవెనను విడుదల చేయాలని అన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దినేష్, సాయి, ప్రశాంత్, అంజి, నాగమ్మ, రాణి, మల్లేశ్వరి, ఆశ, దిలీప్ తదితరులు ఉన్నారు.

'రైతులకు పెట్టుబడి సాయం అందజేయాలి'

నందికొట్కూరు, జూలై 26: రైతుల పెట్టుబడి సాయం పథకాన్ని వెంటనే అమలు చేయాలని సపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణలు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుల పంటలు పెట్టుబడికి సాయంగా ప్రతి సంవత్సరం రూ.20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.

'నందికొట్కూరుకు తాగునీరు అందించాలి'

నందికొట్కూరు, జూలై 26: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్ పరిశ్రమల హబ్‌కు కృష్ణాజలాలను తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారని, ఈ నేపథ్యంలో నందికొట్కూరుకు తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణ సమీపంలో తీసుకెళ్తున్న పైపులైన్ పనులను ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.110 కోట్లతో తలపెట్టిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం పనులను మధ్యలోనే ఆపేశారన్నారు. ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు వెళ్తున్న పైపులైన్ ద్వారా పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రైతు సంఘం నాయకులు నాయుడు, అశోక్, పాండు, సామన్న, రామకృష్ణ, మస్తాన్వలి పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలి'

గోస్పాడు, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకే వర్తింపజేయాలని పీఆర్‌టీయూ నాయకుడు సుబ్బరాయుడు నాయక్ కోరారు. శుక్రవారం గోస్పాడులోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదువుతుంటారని, అమ్మకు వందనం వీరికి మాత్రమే వర్తింపజేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరుగుతాయని అన్నారు. తద్వారా ఉపాధ్యాయుల అవసరం కూడా పెరుగుతుందని అన్నారు. పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, రాజశేఖర్‌రెడ్డి, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జూలై 26: శ్రీశైలం దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం పులివెందులకు చెందిన లింగాల విజయకుమార్ రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధి కారి స్వాములుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, మ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

నేడు వీబీఆర్‌కు నీరు విడుదల

వెలుగోడు, జూలై 26: వెలుగోడు తెలుగుగంగ జలాశయానికి పోతిరెడ్డిపాడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయనున్నట్లు తెలుగుగంగ అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద జలాలు చేరుకొని నీటి మట్టం పెరగడంతో శనివారం పోతిరెడ్డిపాడు వద్ద గేట్లను ఎత్తనున్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య, తెలుగుగంగ అధికారులు పాల్గొని గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు తెలపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

డోన్(రూరల్), జూలై 26: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జీవో. నెం.117ను రద్దు చేసి ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలోనే తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్యాసింజర్ రైళ్లను నడపాలి: సీపీఐ

డోన్(రూరల్), జూలై 26: కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి యథావిధిగా నడపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాధాకృష్ణ, మోట రాముడు, పట్టణ కార్యదర్శి నారాయణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ రైల్వేస్టేషన్‌లో రైల్వే డీఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో పేదలు అధిక చార్జీలు పెట్టుకుని ప్రయాణించలేరని, ప్యాసింజర్ రైళ్లను నడపడం వల్ల పేదలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు.

ఐదో తరగతి వరకు ఒకే ప్రాంగణంలోనే ఉంచాలి

బనగానపల్లె, జూలై 26: ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను ఒకే ప్రాంగణంలో ఉంచాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రకాశ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్, వెంకటేశ్వర్లు మండల విద్యాధికారి స్వరూపకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. సత్యప్రకాశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల విశ్వాసం సన్నగిల్లకముందే నూతన ప్రభుత్వం మేలుకొని విద్యావ్యవస్థలోని లోటుపాట్లను సరిదిద్దాలని కోరారు. జీవో నంబరు 117ను రద్దు చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి, గౌరవ అధ్యక్షుడు సుధాకర్, కృష్ణయ్య, విజయకుమార్, కౌన్సిలర్లు పూజారి శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేత ప్రకటనపై హర్షం

బనగానపల్లె, జూలై 26: సీపీఎస్ ఉద్యమంలో అనేక పోరాటాలు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులను అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అన్నారు. శుక్రవారం ఏపీటీఎఫ్ బనగానపల్లె శాఖా కార్యాలయంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, మాధవస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని ప్రకటించి రద్దు చేయకుండా జీపీఎస్ అను కొత్త పథకాన్ని తీసుకురావడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరా టాలు చేశాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ఓబులేసు, రమేష్, నాయకులు యాగంటప్ప, సురేష్‌రెడ్డి, గోవిందనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయడమే లక్ష్యం

డోన్(రూరల్), జూలై 26: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయడమే లక్ష్యంగా పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌ను అమలు చేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పాతపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన వివిధ వస్తువులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరుకండి

డోన్(రూరల్), జూలై 26: డోన్ ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత కింద ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

కౌలు రైతుల కోసమే కార్డులు

కొలిమిగుండ్ల, జూలై 26: కౌలు రైతుల కోసమే ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులను అందిస్తోందని మండల వ్యవసాయ విస్తరణాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం ఏవో భూమా జ్యోతి ఆధ్వర్యంలో మండలంలోని ఎస్.చెన్నంపల్లె గ్రామంలో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించారు. వీఆర్వో రామసుబ్బయ్య, వీఏహెచ్ఏ శ్రీధర్, వీఏఏ చెన్నయ్య, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

కోవెలకుంట్ల, జూలై 26: అందరి సహకారంతోనే కోవెలకుంట్ల పట్టణం అభివృద్ధి చెందుతుందని మేజరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని బస్టాండు సమీపంలో వారు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి మురుగు నీరు నిల్వ ఉన్న చోట వేస్ట్ ఆయిల్ చల్లించి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు వీధుల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో గోపినాథ్, వార్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి: ఎంపీడీవో

కొలిమిగుండ్ల, జూలై 26: స్పెషల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు వినియోగించు కోవాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని బి.ఉప్పలూరు గ్రామంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆధార్ సమస్యలపై పలువురు లబ్ధిదారులు సమస్యలను నమోదు చేసుకున్నారు. ఆధార్‌లో నెలకొన్న తప్పులు, పొరపాట్లు సరి చేసుకోవడానికి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ప్రజ లకు ఉపయోగపడతాయని ఎంపీడీవో అన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, జూలై 26: కొలిమిగుండ్లలో వీధి లైట్లకు మరమ్మతులు నిర్వహించినట్లు కొలిమిగుండ్ల పట్టణ సర్పంచ్ జినుగు శివరాముడు తెలిపారు. గత కొద్ది రోజులుగా వీధిలైట్లు మరమ్మతుల కారణంగా వెలగక పోవడంతో, సర్పంచ్ శ్రద్ధ తీసుకొని మరమ్మతులు చేపట్టారు.

సీపీఐ నాయకుడి మృతి

డోన్(రూరల్), జూలై 26: సీపీఐ పట్టణ సీనియర్ నాయకుడు గౌండ బాషా గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మోటరాముడు గౌండా బాషా భౌతిక కాయానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి

బనగానపల్లె, జూలై 26: కార్గిల్ అమరవీరులు చిరస్మరణీయులని టెలికాం అడ్వయిజరీ కమిటీ మాజీ సభ్యుడు, బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. కార్గిల్ 25వ దివాస్ సందర్భంగా శుక్రవారం సాయంత్రం మాజీ సైనికోద్యోగులు సంఘం బీసీ రాజారెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర సైనికులకుని నివాళులర్పించి జోహర్లు తెలియజేశారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ సైనికులు దేశానికి వెన్నెముకలాంటి వారన్నారు. సైనికులు సరిహద్దుల్లో కాపలా కాయడం వల్లనే మనం ప్రశాంతంగా నిద్రపోతున్నామన్నారు. కార్గిల్ యుద్ధ భూమిలో 500 మంది భారత సైనికులు వీరమరణం పొందడం బాధాకరమన్నారు. వారి త్యాగాలను ఎన్నటికీ మరువరాదన్నారు. అనంతరం మాజీ సైనికులు తమ సమస్యలను వినతి పత్ర రూపంలో బీసీ రాజారెడ్డికి అందించారు. సమస్యలను ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు బీసీ రాజారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు.

ఆళ్లగడ్డ: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్ల సేవలు మరువలేనివని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల జిల్లా అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎస్ఆర్‌కే పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బనగానపల్లెలో కార్గిల్ అమర వీరులకు నివాళులర్పిస్తున్న బీసీ రాజారెడ్డి, మాజీ సైనికులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం 25వ కార్గిల్ విజయ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారతదేశం భూభాగం కోసం మన జవాన్లు పాకిస్తాన్ జవాన్లతో పోరాడి విజయం సాధించా రన్నారు. ఈ పోరాటంలో భారతదేశ జవాన్ల వీరమరణం పొందారని గుర్తు చేశారు. వీర జవాన్ల మృతికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, క్రిష్ణదాస్, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, శశాంక్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డలో..


కోవెలకుంట్లలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్

వెలుగొండ ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 26: ప్రకాశం జిల్లాలోని దోర్నాల వద్ద గల వెలుగొండ సాగు నీటి ప్రాజెక్టును శుక్రవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సందర్శించారు. వెలుగొండ ప్రాజెక్టులోని సొరంగాన్ని ఎమ్మెల్యే కోట్ల సందర్శించారు. వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్-2 పనుల వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే 3.24 లక్షల ఎకరాలకు సాగునీరు, 11 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. డోన్ నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టు నీరు నింపి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి, ఎరుకుల చెరువు శివ ఉన్నారు.


వెలుగొండ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

చౌడేశ్వరీ మాతకు సారె


చౌడేశ్వరీమాతకు చీర, సారె సమర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ, మహిళలు

బనగానపల్లె, జూలై 26: నందవరం చౌడేశ్వరీమాతకు రోడ్లు భవ నాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, మహిళలు ఆషాఢ మాసం పురస్కరించుకొని చీర, సారెను శుక్రవారం సమర్పించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి బీసీ ఇందిరమ్మతోపాటు అధిక సంఖ్యలో మహిళలు తలపై చీర, సారె పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ప్రజల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. మండల టీడీపీ అధ్య క్షుడు, నందవరం చౌడేశ్వరీమాత అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ ఈవో కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలకు ఆదేశాలు

నంద్యాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని శిల్పా వెంచర్ ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న కేసీ కాలువ తొలగింపునకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి రామానాయుడు సంబంధిత అధికారులను శుక్రవారం ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని పురాతన కేసీ కాలువను గత వైసీపీ పాలకుల ఆదేశాల మేరకు పూర్తిగా తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర శాసన సభలో మాట్లాడిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ స్పీకరుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పీకరు స్పందించిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రిని ఆదేశించటంతో ఈ మేరకు మంత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

శిరివెళ్ల, జూలై 26: మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ పోస్టుకు గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వహించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. పీజీ బోటనీ విభాగంలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పీజీతో పాటు నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీన కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

గర్భిణి మృతి

నంద్యాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని పాత మసీదు వీధిలో నివాసం ఉంటున్న నిండునెలల గర్భిణి గౌసియా(28) శుక్రవారం ఆసుపత్రిలో మృతి చెందారు. తనకు ఆరోగ్యం బాగా లేదంటూ ఉదయం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. దీంతో సిబ్బంది ఆమెకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఇంతలోనే ఫిట్స్ రావడం తో ఆమె చనిపోయారు. గౌసియా రెండో కాన్పుగా వైద్యులు గుర్తించారు. దీనిపై వైద్యశాల సూపరింటెండెంట్ సుజాతమ్మ మాట్లాడుతూ మృతురాలు చాలా బలహీనంగా ఉందని, ఉమ్మనీరు పోతుండటంతో వైద్యశాలకు వచ్చిందని చెప్పారు. దీంతో ఆమెకు పరీక్షలు నిర్వహించగా ఏ లోపం లేదని తెలిపారు. ఈలోగా గౌసియాకు ఫిట్స్ రావడంతో చనిపోయిందని తెలిపారు.

వైద్యుల పని తీరుపై విచారణ

చాగలమర్రి, జూలై 26: చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పనితీరుపై శుక్రవారం అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి బృంద అధికారులతో విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యుల విధులపై విచారణ చేశామని ఆమె తెలిపారు. వైద్యులు అంజలి స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అప్తాలాజిస్టు మాధవీలత, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

'కుష్టు వ్యాధి సర్వే పకడ్బందీగా చేపట్టాలి'

చాగలమర్రి, జూలై 26: గ్రామాల్లో నిర్వహించే కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి శారదాబాయి సూచించారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, వైద్య సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,610 టీమ్‌లతో ఇంటింటి సర్వే చేస్తున్నామని, 2,290 అనుమానిత కేసులు గుర్తించామని తెలిపారు. వైద్యులు అంజలి, ఇమ్రాన్, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

శిరివెళ్ల, జూలై 26: శిరివెళ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌వో జ్యోతి శుక్రవారం తెలిపారు. యోగా అసోసియేషన్ గేమ్స్‌లో భాగంగా ఈ నెల 21, 22వ తేదీల్లో ఆళ్లగడ్డలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అండర్-16 విభాగంలో జ్యోతి, అండర్ -14 విభాగంలో మౌనిక, అండర్ -12 విభాగంలో దీపిక ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. సెప్టెంబరులో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ఎస్‌వో, పీఈటీ, ఉపాధ్యాయినులు అభినందించారు.

మిరప పంట దున్నివేత.. కేసు నమోదు

రుద్రవరం, జూలై 26: మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అనే రైతు మిరప పంట పొలాన్ని 25 సెంట్లు అదే గ్రామానికి చెందిన రమణారెడ్డి అనే రైతు ట్రాక్టరుతో దున్ని వేశాడని ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రూ.50వేల రూపాయలు నష్టం వాటిల్లిందని లక్ష్మీరెడ్డి ఫిర్యాదులో చెప్పినట్లు తెలిపారు. ఈ మేరకు రమణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

కొలిమిగుండ్ల, జూలై 26: మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. శుక్రవారం రామ్‌కో సిమెంటు పరిశ్రమ ఆవరణలో దేశ ప్రధాని ఏక్ పేడ్ మా కే నామ్ పిలుపు మేరకు రామ్‌కో మాతృవనం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. సుమారు 500 మొక్కలు నాటి, వాటి సంరక్షణ కోసం ఒక్కో ఉద్యోగికి ఒక మొక్కను అప్పగిం చారు. అడ్మిన్ హెడ్ రామరాజు, అజ్మల్ అహ్మద్, రవికుమార్, ఈశ్వరన్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రం తనిఖీ

బేతంచెర్ల, జూలై 26: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని ఎస్‌సీఈఆర్‌టీ అబ్జర్వర్, కోర్సు డైరెక్టర్ సోమశేఖర్ శుక్రవారం సందర్శించారు. టీచ్ టూల్ కార్యక్రమంపై ఆయన అందులో పాల్గొన్న ఉపాధ్యాయులతో చర్చించారు. మధ్యాహ్న భోజనం కూడా పరిశీలించి సంతృప్తిని తెలియజేశారు. ఆయనతో పాటు నంద్యాల జిల్లా అలెస్కో కోఆర్డినేటర్ రఘురాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కౌడిపీర్లకు షహదత్

సంజామల, జూలై 26: సంజామలలో కొలువుదీరిన కౌడిపీర్లకు శుక్రవారం షహదత్ వేడుకలు నిర్వహించారు. మొహర్రం వేడుకలు ముగిసిన మరుసటి రోజు గ్రామంలో కౌడిపీర్లను కొలువుదీర్చారు. గ్రామ చావిడిలో కొలువుదీరిన పీర్లకు పది రోజులపాటు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. శుక్రవారం సాయంత్రం కౌడి పీర్లకు డప్పు వాయిద్యాల మధ్య షహదత్ వేడుకలను నిర్వహించారు. ఏటికి తీసుకెళ్లి శుద్ధి చేశారు.

ఘనంగా జియారత్ వేడుకలు

ఉయ్యాలవాడ, జూలై 26: మండలంలోని కాకరవాడ గ్రామంలో శుక్రవారం జియారత్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. లాల్‌స్వామిని పూలమాలలతో అలంకరించారు. తెల్లవారు జామున వారికి అగ్ని గుండ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

పార్వతీదేవికి చీర సమర్పణ

చాగలమర్రి, జూలై 26: చాగలమర్రిలోని కోదండరామాలయంలో పార్వతిదేవి, అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా శుక్రవారం చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. పార్వతీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

కేసీ కాలువ గండికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, జూలై 26: చాగలమర్రి గ్రామంలోని 11 కమాండ్ల సమీపంలో కేసీ కాలువకు గండిపడి కోతకు గురైంది. 'కేసీ కాలువకు గండి' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి శుక్రవారం కూలీలతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఇసుక సంచులతో కోతకు గురైన ప్రదేశంలో బండ్ పనులు చేపట్టారు. కేసీ కాలువకు నీరు విడుదల చేయాల్సి ఉండటంతో మరమ్మతు పనులు వేగవంతం చేస్తున్నామని ఏఈ తెలిపారు. కేసీ కాలువను గండ్లు పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు.


కేసీ కాలువ గండికి ఇసుక సంచులతో మరమ్మతులు చేస్తున్న కూలీలు

'బాలికలను చదివించాలి'

రుద్రవరం, జూలై 26: బాలికల చదువు దేశానికి వెలుగు అని సీఐ చంద్రబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాయమాటలు నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎఎస్ఐలు భూపాల్‌రెడ్డి, బాలన్న, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

ఉయ్యాలవాడ, జూలై 26: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో రాంబాబు అన్నారు. మండలంలోని గోవిందపల్లెలో శుక్రవారం డీఎల్‌పీవో తమ టీం సభ్యులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడీఎఫ్ ప్లస్ గ్రామాల్లో బహిరంగ రహిత మలవిసర్జన గ్రామాలుగా చేయటమే స్వచ్ఛ భారత్ లక్ష్యం అని అన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఏడు ఏడీఎఫ్ ప్లస్ గ్రామాల్లో పర్యటించామన్నారు. నంద్యాల, ఉయ్యాలవాడ ఎంపీడీవోలు సౌభాగ్యమ్మ, రఘురామ్, నంద్యాల, ఉయ్యాలవాడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మురళీ నాయక్, ప్రణీత్‌క్రిష్ణ, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

బేతంచెర్ల, జూలై 26: పట్టణంలోని దుర్గాపేటకు చెందిన బుడ్డ గాళ్ల శివ అనే వ్యక్తి దుర్గమ్మ గుడి వద్ద మద్యం విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య శుక్రవారం తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన షేక్ బాబర్ హుశేన్, అతని కూతురు షేక్ ముస్కాన్‌లు పట్టణానికి చెందిన సయ్యద్ సలీం మహ్మద్‌కు డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.50 లక్షలు తీసుకొని మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తండ్రీ కూతుళ్లపై 420 కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పారిశుధ్య సిబ్బంది పని తీరుపై ఆగ్రహం

చాగలమర్రి, జూలై 26: పారిశుధ్య సిబ్బంది పని తీరుపై ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చాగలమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ తులశమ్మ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఈవో తాహిర్ హుసేన్ మాట్లాడుతూ చాగలమర్రి మేజర్ పంచాయతీ వోడీఎఫ్ ప్లస్ గ్రామంగా ఎంపికైతే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందని అన్నారు. పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బలపాలపల్లె సమస్యలు పరిష్కరించండి

బేతంచెర్ల, జూలై 26: మండలంలోని బలపాలపల్లెలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని టీడీపీ నాయకులు పోలూరు శ్రీనివాసరెడ్డి, జావాజి వెంకటేశ్వర్లు, ఉన్నం జీవన్ చౌదరి, ఆర్.ఈశ్వరయ్యలు కలెక్టర్ రాజకుమారిని కోరారు. శుక్రవారం ఆమెకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని యువ రైతు కోటయ్య తన పొలంలో హార్టికల్చర్ స్కీం కింద మామిడి మొక్కలు నాటించుకోవడానికి ఉపాధి హామీ కూలీలతో తెప్పించిన ఫిట్టింగ్ గుంతలను విజిట్ చేయడానికి కలెక్టర్ గ్రామానికి వచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ బలపాలపల్లెలో ఊరగుంట శ్మశానవాటిక సర్వే నెంబరు.454/ఏఎలో ఆరు ఎకరాల 93 సెంట్ల ప్రభుత్వ భూమిలో కొంత భూమిని శ్మశాన వాటికకు ఇరువైపులా ఉన్న వ్యక్తులు ఆక్రమించుకున్నారని అన్నారు. కొత్తకుంటలో మట్టిని తీసి తెగిపోయిన కట్టకు మరమ్మతు చేయించాలని గ్రామస్థులు కోరారు.

ప్రతి ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించుకోవాలి

అవుకు, జూలై 26: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని డోన్ డీఎల్‌పీవో రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం డోన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డి, డోన్ ఈవోఆర్డీ జయరాం, డోన్ ఎంపీడీవో శ్రీనివాసులు, అవుకు ఎంపీడీవో మల్‌రెడ్డితో కలసి సంగపట్నం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో బాలకృష్ణుడు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారన్నారు. మరుగుదొడ్డిని నూతనంగా నిర్మించుకొనే వారికి ప్రభుత్వం రూ. 15 వేలు అందిస్తుందన్నారు. అలాగే 2018-19లో సంగపట్నం గ్రామం 100 శాతం మరుగుదొడ్లు ఉన్న గ్రామంగా ఎంపికైందని అన్నారు. కార్యక్రమంలో అవుకు ఈవోఆర్డీ రామక్రిష్ణవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, పంచా యతీ కార్యదర్శులు శ్రీనివాసులు, నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన

రుద్రవరం, జూలై 26: మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో శుక్రవారం పొలం బడి నిర్వహించి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. బూత్ అగ్రికల్చర్ ప్రాక్టీసులో భాగంగా పొలంబడి నిర్వహించారు. నూతన వ్యవసాయ విధానంలో ప్రతి రైతు ఒక శాస్త్రవేత్త అని వ్యవసాయాధికారి శ్రీకృష్ణ అన్నారు. పొలంబడి కింద శ్రీరంగాపురం గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. నారుమడిలో యాజమాన్య పద్ధతులుపై రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నంద్యాల నారాయణరెడ్డి, ఏఈవో రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు


బనగానపల్లె, జూలై 26: బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో వెలసిన వాసవీమాత ఆలయంలో శుక్రవారం రాత్రి వాసవీ మాత శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. పట్ట ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాథంశెట్టి వేణుగోపాల్, కార్యదర్శి శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, గుండా రవికుమార్, మహిళా మండలి అధ్యక్షురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని పాతబస్టాండు కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారు శాకంబరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరీదేవి శాంకబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో ఆర్యవైశ్యులు అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ మాస పూజలు

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల చౌడేశ్వరీ అమ్మవారి ఆలయాల్లో ఆషాఢ మాస ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్లతోపాటు, అబ్దులాపురం, కోటపాడు, కనకాద్రిపల్లె తదితర గ్రామాల ఆలయాల్లో అమ్మవారికి బోనాలు, నూతన వస్త్రాలు సమర్పించి, కుంకుమార్చనలు నిర్వహించి, నైవేద్యం సమర్పణ చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు.



బనగానపల్లె, డోన్‌లో శాకంబరి అలంకారంలో అమ్మవారు